## క్లుప్తంగా

### విజయ్‌భాస్కర్‌రెడ్డికి అవార్డు




అవార్డు అందుకుంటున్న విజయభాస్కర్‌రెడ్డి

దుబ్బాక: పట్టణంలోని గాయత్రి వివేకానంద విద్యాలయం ప్రిన్సిపాల్ విజయభాస్కర్‌రెడ్డికి రాష్ట్రస్థాయిలో బెస్ట్ ప్రిన్సిపాల్–2024 అవార్డు అందుకున్నారు. హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్ సోమాజిగూడలో జరిగిన యూనివర్సల్ మెంటర్స్ అసోసియేషన్, ట్రిస్మా ఆధ్వర్యంలో నిర్వహించిన 15వ ఎడ్యుర్స్ అండ్ లీడర్స్ సమ్మిట్‌లో అందజేశారు. అవార్డు గ్రహీతను పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులతో పాటు పలువురు ప్రత్యేకంగా అభినందించారు.

### సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



సిగ్నల్స్‌పై ట్రాఫిక్ సిబ్బందికి శిక్షణ ఇస్తున్న అధికారులు

సిద్దిపేటకమాన్: విధి నిర్వహణలో ట్రాఫిక్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సిద్దిపేట ట్రాఫిక్ సీఐ ప్రవీణ్‌కుమార్ సూచించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద సిబ్బంది విధి నిర్వహణ గురించి ట్రాఫిక్ పీఎస్‌లో సిబ్బందికి ఐదు రోజులుగా ఇస్తున్న శిక్షణ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ, సిగ్నల్స్ వద్ద వాహనాలు ఎలా పంపించాలని అనే అంశాలపై సిబ్బందికి శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. ట్రాఫిక్ జామ్, ఇతర సమస్యలు ఎదురైనప్పుడు సిబ్బంది వెంటనే కమ్యూనికేషన్ సెట్ ద్వారా అధికారులకు తెలపాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ గోపాల్‌రెడ్డి, ఏఎస్ఐ ఉమేశ్, కానిస్టేబుళ్లు జగదీశ్, గోపాల్, మహేశ్, రాజేశ్, కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రజాదరణను ఓర్వలేకే ఎమ్మెల్యేపై కుట్రలు

చేర్యాల(సిద్దిపేట): హైడ్రా పేరుతో ప్రభుత్వం డ్రామాలు ఆడుతోందని చేర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ మంగోలు చంటి మండిపడ్డారు. ఆదివారం పట్టణంలో చంటి విలేఖరులతో మాట్లాడుతూ హైడ్రా పేరుతో ప్రభుత్వం డ్రామాలు చేస్తోందన్నారు. అందులో భాగంగానే జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డిపై కేసు నమోదు చేయించిందన్నారు. కొన్ని నెలలుగా జనగామ నియోజకవర్గ ప్రజలకు నీలిమ హాస్పిటల్‌లో ఉచిత వైద్య సేవలు అందిస్తున్నారని, అనురాగ్ యూనివర్సిటీలో ఆర్థిక స్తోమత లేని విద్యార్థులకు ఫీజు తగ్గించి అండగా నిలుస్తున్నారన్నారు. దీంతో ప్రజల్లో వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక ఎమ్మెల్యే కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. హైడ్రా పేరుతో అనురాగ్ యూనివర్సిటీలో అక్రమ కట్టడాలు జరిగాయని నోటీసు పంపడం సిగ్గుమాలిన చర్యగా అభివర్ణించారు. కాంగ్రెస్ నేతల అక్రమ కట్టడాలను కూల్చివేయగలరా అంటూ ప్రశ్నించారు. రుణమాఫీ అంశాన్ని పక్కదారి పట్టించేందుకే హైడ్రాతో హైప్ చేస్తూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో కబ్జా అయిన భూములపై శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

### భద్రాచల తలంబ్రాలు పంపిణీ



తలంబ్రాలను పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక మార్కండేయ ఆలయంలో భద్రాచల ముత్యాల తలంబ్రాలను పంపిణీ చేశారు. శ్రీరామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ నిర్వాహకులు రామకోటి రామరాజు మాట్లాడుతూ, తమ సంస్థ చేస్తున్న సేవలను గుర్తించి భద్రాచల దేవస్థానం 100 కిలోల ముత్యాల తలంబ్రాలను అందజేసిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష మంది భక్తులకు వాటిని పంపిణీ చేస్తామన్నారు.ముందుగా పట్టణంలో తలంబ్రాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. అనంతరం రామకోటి రామరాజును ఆలయ నిర్వాహకులు సన్మానించారు.

### ఆర్థిక సాయం

దుబ్బాకరూరల్: దుబ్బాక 108 అంబులెన్స్‌లో డ్రైవర్ లింగం కుటుంబానికి మెదక్ ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ జనార్దన్ చేతుల మీదుగా రూ.15 వేలు ఆర్థిక సాయం అందజేశారు. లింగం అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల ఆత్మహత్య చేసుకుని మృతిచెందాడు. కాగా, 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కాగా, మృతుడిది జిల్లా కామారెడ్డి జిల్లా భిక్కనూర్ మండలం కంచర్ల స్వగ్రామం.



గాగ్గిళ్లాపూర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు



వల్లంపట్లలో..

### • బోనాల సందడి

మద్దూరు మండలం గాగ్గిళ్లాపూర్, లద్నూరు, వల్లంపట్ల గ్రామస్తులు గ్రామ దేవతలకు బోనాలు సమర్పించారు. మహిళలు నెత్తిన బోనాలు పెట్టుకొని డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా ఆలయాలకు చేరుకొని అమ్మవార్లకు బోనాలను సమర్పించి మొక్కులు చెల్లించారు.– మద్దూరు(హుస్నాబాద్)

### • కృష్ణాష్టమి వేడుకలు



కృష్ణాష్టమిని పురస్కరించుకుని ఆదివారం జిల్లా కేంద్రంలోని మెరిడియన్ పాఠశాలలో ముందస్తు వేడుకలను నిర్వహించారు. కృష్ణుడు, గోపికలు, యశోదల వేషధారణలో చిన్నారులు అలరించారు. దేవేందర్ రెడ్డి, రాజా వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – ప్రశాంత్‌నగర్(సిద్దిపేట)

# రామక్కపేట–చీకోడ్ రోడ్డు అధ్వానం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రోడ్డుపై గుంతలు ఏర్పడి.. నిలుస్తున్న వర్షపు నీరు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- మరమ్మతులు చేపట్టాలని ప్రజల వినతి

దుబ్బాక: ఈ రోడ్డుపై కంకర తేలి.. పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి .. వర్షపు నీరు నిలిచింది. అదే దుబ్బాక మండలం రామక్కపేట–చీకోడ్ గ్రామాల ప్రధాన రహదారి. చాలా ఏళ్ల క్రితం నిర్మించడంతో బీటీ లేచిపోయి కంకర తేలి, పెద్ద గుంతలతో ప్రయాణానికి వీలు లేకుండా తయారైంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై గుంతల్లో నీరు నిలవడంతో చిన్నపాటి కుంటలను తలపిస్తున్నాయి. దీంతో వాహన రాకపోకలకు తీవ్ర ఇబ్బందిగా తయారైంది. గుంతల రోడ్డుతో తరచుగా వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక రాత్రి వేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణించడం నరకయాతనగా మారింది. రాత్రి వేళల్లో వాహనాదారులు గుంతల్లో పడి తీవ్రగాయాల పాలవుతున్నారు. రోడ్డును బాగు చేయాలని అధికారులకు ఎన్ని సార్లు విన్నవించినా ఫలితం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



రామక్కపేట-చీకోడ్ రోడ్డు దుస్థితి

**రోజూ ప్రమాదాలు..**



రామక్కపేట–చీకోడ్ గ్రామాల మధ్యనున్న ప్రధాన రహదారి గుంతలమయంగా మారి పూర్తిగా అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై ప్రయాణం నరకానికి నకల్‌గా మారింది. ప్రతీరోజు రోడ్డుపై చాలా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. అధికారులు ఇప్పటికైనా తగు చర్యలు తీసుకోవాలి.
– సాల్వేరు రవీందర్, రామక్కపేట

**మరమ్మతులు చేపట్టాలి**



గుంతల రోడ్డుతో ప్రమాదాలు చోటుచేసుంటున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.రోడ్డు పూర్తిగా వర్షాలకు గుంతల్లో నీరు నిలవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులకు ఏళ్ల నుంచి విన్నవించినా ఫలితం లేదు. అధ్వానం రోడ్డుతో ప్రాణాలు పోతున్నా పట్టించుకోవడం లేదు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేయాలి.
–దొంతగౌని శ్రీధర్‌గౌడ్, రామక్కపేట

# మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు

**మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఆకుల రజిత**

హుస్నాబాద్: యువత మత్తుపదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత సూచించారు. జన వికాస ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీ చౌరస్తాలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కరీంనగర్ సీవీపీఎం ఆస్పత్రి చైర్మన్, ఎండీ ఫిజిషియన్ డాక్టర్ శ్రీధర్ సౌజన్యంతో ఉచిత ఆరోగ్య శిబిరాన్ని ఏర్పాటు చేయగా ఆమె ప్రారంభించారు. బీపీ, షుగర్, టెస్టులతో పాటుగా వివిధ రకాల జబ్బులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ యువత మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. అలా చేసుకోవద్దని మంచి తోవలో పయనించాలని ఆకాంక్షించారు. చిన్న వయసు పిల్లలకు షుగర్ వస్తోందన్నారు. కరోనా తర్వాత కూడా చాలా మందికి గుండెకు సంబంధించిన వ్యాధులు వస్తున్నాయన్నారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ప్రతీఒక్కరు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలన్నారు. సీజనల్ వ్యాధులు మలేరియా, డెంగీ, టైఫాయిడ్ లాంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు నిర్వహించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బాల వికాస వాటర్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కేడం లింగమూర్తి, కౌన్సిలర్లు దొడ్డి శ్రీనివాస్, వల్లపు రాజు, మాజీ ఎంపీపీ ఆకుల వెంకట్, బాల వికాస ప్రతినిధులు పిల్లి జ్యోతి, అలుమల్ల నిర్మల, తాళపాక శ్రీమతి, డాక్టర్ సువన, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గాజి నాసరొద్దీన్‌కు సీఎంఆర్‌ఎఫ్ చెక్‌ను అందజేస్తున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు. – (సిద్దిపేట జోన్)

# ఇక్కడి విద్యార్థులకు ధైర్యం ఎక్కువ

- శిశుమందిర్ ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే హరీశ్‌రావు
- పూర్వ విద్యార్థిగా హాజరుకావడం సంతోషం

సిద్దిపేటకమాన్: దేశానికి మంచి పౌరులను అందించే విద్యాలయాలు సరస్వతీ శిశుమందిర్ విద్యాలయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. పట్టణంలో ఆదివారం నిర్వహించిన సరస్వతి శిశుమందిర్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనంలో ఆయన మాట్లాడారు. తాను 1 నుంచి ఆరో తరగతి వరకు సరస్వతి శిశు మందిర్‌లో చదువుకున్నానన్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థిగా తాను పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న వారికి ఆత్మవిశ్వాసంతో పాటు మనో ధైర్యం ఎక్కువగా ఉంటుందని, ఎలాంటి కష్టమైనా ఎదుర్కొనే శక్తి వస్తుందన్నారు. సామాజిక బాధ్యత, దేశభక్తి పెంపొందించే ఉత్తమ పాఠశాలలివే అన్నారు. కార్యక్రమంలో గురువులు, పూర్వ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**విజ్ఞాన భాండాగారం శిశుమందిర్..**

**ఎంపీ రఘునందన్‌రావు**

దేశ సంస్కృతీసంప్రదాయాల నిర్మాణ భాండాగారాలు సరస్వతీ శిశు మందిర్‌లని, ఈ పాఠశాలల్లో చదువుకున్న అనేక మంది విద్యార్థులు నేడు ఉత్తమ స్థానంలో ఉన్నారని ఆత్మీయ సమ్మేళనంలో మెదక్ ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రతీఒక్కరూ అవగాహన కల్పించాలన్నారు. ఓటే దేశ నిర్మాణానికి బాటలు వేస్తోందన్నారు. ఓటు వేయని వారికి సమస్యను అడిగే హక్కు లేదన్నారు. విద్యతో పాటు క్రీడలు, సంస్కృతీ సంప్రదాయాలను నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు ప్రత్యేకత ఉంటుందన్నారు. సరస్వతి శిశు మందిర్ పాఠశాలలను మరిన్ని నిర్వహించాల్సిన అవసరం ఉందని, ఈ విషయంపై పార్లమెంట్‌లో మాట్లాడనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

### ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాల్సిందే

హుస్నాబాద్‌రూరల్: సమస్యలను పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌నాయక్ అన్నారు. ఆదివారం హుస్నాబాద్ నిర్వహించిన ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడారు. 317 జీఓ బాధిత ఉపాధ్యాయులకు ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయులకు ప్రమోషన్లు ఇచ్చి, రావాల్సిన డీఏను ఇవ్వాలన్నారు. గిరిజన ప్రాంతాల పాఠశాలల్లో మౌలిక సదుపాయాలను కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలోని ఖాళీలను భర్తీ చేసి విద్యార్థుల విద్యాబోధనకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శంకర్‌నాయక్, తిరుపతి, సోములు, నెహ్రూ, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

### బోనం.. ఘనం



బొబ్బాయిపల్లిలో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గ్రామస్తులు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి మండలం బొబ్బాయిపల్లి గ్రామంలో శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఆదివారం బోనాలను ఘనంగా ఊరేగించి గ్రామ దేవతలకు సమర్పించారు. ఏటా గ్రామ దేవతలకు బోనాల సమర్పణలో భాగంగా శివసత్తుల పూనకాలు, జోగినీల నృత్యాలు అలరించాయి. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు కోల సద్గుణ మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

### ఏకీకృత పెన్షన్ ప్రకటన సరికాదు : టీసీపీఎస్ఈఏ

బెజ్జంకి(సిద్దిపేట): కేంద్ర ప్రభుత్వం ఉద్యోగుల కోసం చేసిన ఏకీకృత పెన్షన్ ప్రకటన సరికాదని టీసీపీఎస్ఈఏ (తెలంగాణ రాష్ట్ర కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయీస్ అసోసియేషన్ ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పుప్పాల కృష్ణకుమార్, హన్మండ్ల భాస్కర్‌లు ఆదివారం పేర్కొన్నారు. సీపీఎస్ ఉద్యోగులతో కేంద్రం చలగాటం ఆడుతోందన్నారు. పెన్షన్ గ్యారంటీల్లో నిబంధనలు విధించడం సరికాదన్నారు. యూపీఎస్ విధానం లోపభూయిష్టంగా ఉందని తెలిపారు. ఏకీకృత పెన్షన్ ప్రకటనను వెనక్కి ఉపసంహరించుకోవాలన్నారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా సీపీఎస్ విధానం రద్దు చేసి ఉద్యోగులను, వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు.



అధ్యక్ష,కార్యదర్శులు కృష్ణపసాద్, భాస్కర్

# • బీపీ మండల్‌కు నివాళి



చిన్నకోడూరు: మండల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నేతలు



హుస్నాబాద్: నివాళులు అర్పిస్తున్న జేఏసీ నాయకులు

ఓబీసీలు విద్యారంగంలో అనుభవిస్తున్న రిజర్వేషన్లు బీపీ మండల్ చలవేనని వక్తలు కొనియాడారు. మండల కేంద్రంలో ఆదివారం బిహార్ మాజీ ముఖ్యమంత్రి, జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో జేఏసీ నేతలు, జేఏసీ నాయకులు, పలుపార్టీల నాయకులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. –నెట్‌వర్క్

# జర్నలిస్టుల సంక్షేమానికి కృషి చేయాలి

**ఎంపీ రఘునందన్‌రావు**

దుబ్బాక: ప్రభుత్వం జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేయాలని మెదక్ ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు అన్నారు. రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ దుబ్బాక మండలం హబ్షీపూర్‌కు చెందిన జర్నలిస్టు అస్కరాజును ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను జర్నలిస్టుగా పనిచేశానని, వృత్తిపరంగా వారి బాధలు ఎలా ఉంటాయో తెలుసన్నారు. ఎండనక, వాననక నిరంతరం ప్రజల సమస్యలు వెలుగులోకి తెచ్చేందుకు పాటుపడుతున్న జర్నలిస్టుల పరిస్థితి మాత్రం కడు దయనీయంగా ఉందన్నారు. జర్నలిస్టుల కు న్యాయపరంగా అందాల్సిన హక్కులు అందడం లేవన్నారు. సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు అంబటి బాలేశ్‌గౌడ్, సుభాశ్‌రెడ్డి, పుట్ట వంశీ తదితరులు ఉన్నారు.



రాజును పరామర్శిస్తున్న ఎంపీ రఘునందన్

## సంక్షిప్త వార్తలు

**◆ సన్మానం**

గజ్వేల్: మండలంలోని కొడకండ్లలో ఇటీవల స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందిన దూలం వెంకటయ్య, గజ్వేల్ వెంకట్‌కిరణ్‌లను టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు శ్రీనివాసరావు, రాంచంద్రం, శ్రీశైలం, ప్రభాకర్, రాము, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

**◆ పార్టీలకతీతంగా పథకాలు**

కోహెడరూరల్(హుస్నాబాద్): పార్టీలకు అతీతంగా కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అందిస్తుందని పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బత్తుల రాజు అన్నారు.మండలంలోని రాంచంద్రపురం గ్రామంలోని గ్రామ పంచాయతీ వద్ద సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను బాధితురాలు చుక్క లక్ష్మి రూ.55,000 చెక్కును అందించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రిలీఫ్ ఫండ్ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

**◆ ట్యాబ్స్, జాకెట్స్ అందజేత**




అక్కన్నపేట(హుస్నాబాద్): అక్కన్నపేట మండల పోలీసు బ్లూకోల్ట్స్ సిబ్బంది రమేశ్, త్యాగరాజులకు ఆదివారం ఎస్సై విజయ్‌భాస్కర్ నూతన ట్యాబ్, జాకెట్స్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్లూకోల్ట్స్ నిరంతరంగా మండలవ్యాప్తంగా పర్యటిస్తుంటారన్నారు. డయల్ 100కు కాల్ చేయగానే సంఘటన స్థలానికి చేరుకొని సమస్యలు పరిష్కరించేలా కృషి చేస్తారన్నారు. ప్రజలందరూ తప్పనిసరిగా అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100కు కాల్ చేయాలన్నారు.

**◆ ఆరోపణలు మానుకోవాలి**

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేయడంపై బీఆర్ఎస్, సీపీఎం పార్టీల నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను మానుకోవాలని కాంగ్రెస్ నాయకులు హితవు పలికారు. ఆదివారం పట్టణ కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ.2 లక్షల రుణమాణఫీ చేయడం పట్ల రైతులు, ప్రజల నుంచి వస్తున్న విశేష స్పందన చూసి ఓర్వలేక కొందరు అసత్య ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. కొన్ని సాంకేతిక కారణాలవల్ల కొందరు రైతుల రుణాలు మాఫీ కాలేదని, దాన్ని ప్రతిపక్ష నాయకులు రాద్ధాంతం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంచాల చిరంజీవులు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

**◆ మగ్దూంకు నివాళి**



హుస్నాబాద్: తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మగ్దూం మొహియుద్దీన్ చరిత్రను ప్రస్తుత సమాజానికి తెలియజేసేలా ప్రభుత్వం కృషి చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కలవేణి శంకర్ కోరారు. పట్టణంలోని అనభేరి, సింగిరెడ్డి అమరుల భవన్‌లో ఆదివారం మగ్దూం మగ్దూం మొహియుద్దీన్ 56వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో ఆయన చురుగ్గా పాల్గొన్నారన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి మంద పవన్, జిల్లా కార్యవర్గసభ్యులు గడిపె మల్లేశ్, జాగిరి సత్యనారాయణ, వనేశ్, కసుకుంట్ల శంకర్, లక్ష్మణ్, భాస్కర్, గోపి, జనార్దన్ తదితరులు ఉన్నారు.

**◆ విమర్శలు తగవు**

మిరుదొడ్డి(దుబ్బాక): అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేక చేస్తున్న విమర్శలను మానుకోవాలని మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య అన్నారు. ఆదివారం మిరుదొడ్డిలో ఆయన మాట్లాడుతూ, బీఆర్ఎస్ హయాంలో ఏ ఒక్క రైతుకు కూడా పంట రుణమాఫీ చేయలేదన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి పెద్ద పీట వేసిందన్నారు. ఏకకాలంలో రూ. 2 లక్ష రుణమాఫీ చేసిన ఘనత రేవంత్ ప్రభుత్వానికే దక్కిందన్నారు. మాజీ సర్పంచ్ కనకారెడ్డి, మాజీ ఎంపీటీసీ తదితరులు పాల్గొన్నారు.